క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



మోరిపోడులో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: మండలంలోని మోరిపోడు గెడ్డం వారి గ్రూపులో సోమవారం ఏర్పాటు చేసిన 40 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పర్తి త్రిమూర్తులు, నాయకులు ముప్పర్తి నాగభూషణం, ముప్పర్తి నాని, వలవల అంజి, కె.అగస్టీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి సంబరం



సంబరంలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: పెదపట్నంలంకలో సోమవారం వీరభద్రస్వామి సంబరం ఘనంగా జరిగింది. సన్నాయి వాయిద్యాలు, బాణ సంచా కాల్పులు, భక్తుల కోలాహలం, ప్రభ ఊరేగింపు నడుమ జాతర మహోత్సవం ఆద్యంతం కనులపండువగా జరిపించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము ఆధ్వర్యంలో వీరభద్రస్వామి సంబరం నిర్వహించారు. శత వసంతాల సంబరంలో భాగంగా గణాపాటి కొమ్ముల హిమయ్ రామ్ చరణ్ ఆధ్వర్యంలో భక్తులు ప్రభ ఊరేగింపుతో వైనతేయ గోదావరి నదికి వెళ్లారు. గోదావరి నదీ స్నానం అనంతరం అక్కడి నుంచి ఊరేగింపుగా వచ్చి జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. బాల భక్తులు 60 గజాల నిప్పులగుండం తొక్కారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని వీరభద్ర స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు పళ్లాలమ్మ జాతర



మామిడికుదురు: మొగలికుదురు గ్రామదేవత పళ్లాలమ్మ జాతర మంగళవారం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. అమ్మవారి జాతర ఈ నెల 21వ తేదీ ఆదివారం వరకు ఆరు రోజుల పాటు జరుగుతాయని కమిటీ పేర్కొంది. 18వ తేదీ గురువారం అమ్మవారికి నైవేద్యాలు చెల్లిస్తారని, అదే రోజు అమ్మవారి తీర్థం జరుగుతుందన్నారు. 21వ తేదీ ఆదివారం ఉదయం ఆలయ వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మ వారి ఆలయాన్ని రంగులతో సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాల కాంతులతో అమ్మ వారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ప్రసన్నాంజనేయునికి అభిషేకం

సఖినేటిపల్లి: మోరిలో కొలువైన ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో స్వామికి పుణ్యనదుల్లోని పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించారు. స్వామివారి జయంతి మహోత్సవాలు రెండో రోజున అర్చకుడు వాడపల్లి వెంకట సాయి శేషాచార్యుల ఆధ్వర్యాన ఈ అభిషేకం చేశారు. అలాగే తమలపాకులతో స్వామికి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడు

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు జరిగిందని ఏపీఈపీడీసీఎల్ రిటైర్డ్ సీజీఎం నల్లా గంగాధర్ పేర్కొన్నారు. బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవంలో భాగంగా ఆదుర్రు శివారు మోరిపాలెంలో ఆదివారం రాత్రి జరిగిన సభకు ఈసీఐఎల్ రిటైర్డ్ ఏజీఎం తాడి సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గంగాధర్ మాట్లాడుతూ పూర్వం బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం రచించిన తర్వాతే ఆయా వర్గాలకు మేలు జరిగిందన్నారు. దీనిలో భాగంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన అంబేడ్కర్ జనరల్ నాలెడ్జ్ టెస్టుతో పాటు చిన్నారులకు ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

సమితి నుంచి సహదేవ్ తొలగింపు

మలికిపురం: రాజోలు నియోజకవర్గ పరిరక్షణ సమితి నుంచి సమితి మీడియా, కమిటీ సభ్యుడు తాడి సహదేవ్‌ను తొలగించినట్టు సమితి కార్యవర్గం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గూడపల్లి పల్లిపాలెంలో వెలికి గురయిన ప్రేమ జంట విషయంలో ఆర్థిక అక్రమ ఆరోపణలు ఎదుర్కొన్న సహదేవ్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు కమిటీ తెలిపింది. కమిటీ సభ్యుడు సహదేవ్ బాధితులను భయపెట్టి పోలీసుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని సమితి ఆ ప్రకటనలో పేర్కొంది.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- కొత్తూరు, ఎల్.గన్నవరంలో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు



కొత్తూరు సెంటర్‌లో ప్రజలకు సంక్షేమ పథకాల్ని వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



ఎల్.గన్నవరంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఆలమూరు: ప్రజా సంక్షేమం, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తూ పేదల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లో సోమవారం పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమానికి గ్రామస్తులు అపూర్వ సాగతం పలికారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలు అడిగిన సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగారు. రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దళారీ వ్యవస్థ లేకుండా గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుని ఇంటికే నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తూ జీవన ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కొత్తూరు సెంటర్‌లోని కాలనీ అభివృద్ధికి అన్ని విధాలీ సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా సుమారు రూ.పది లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ వ్యవస్థకు భూమి పూజ చేశారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంఏఏఎస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ నెక్కంటి వెంకట్రాయుడు, సర్పంచ్‌లు గుణ్ణం రాంబాబు, వనుం చిన్నావతి పాల్గొన్నారు.

ఎల్.గన్నవరంలో..

పి.గన్నవరం: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని ఎల్.గన్నవరంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సొసైటీ కమిటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్, పార్టీ నాయకులు మానుకొండ ప్రసాద్, గనిశెట్టి రామగణపతిరావు, అన్నాబత్తుల చంటి తదితరులతో కలసి చిట్టిబాబు ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కుటుంబాల వారీగా చేకూరిన లబ్ధిని చిట్టిబాబు వివరించారు. ఇంకా ఎవరైనా అర్హులు మిగిలి ఉంటే వారికి కూడా పథకాలను అందిస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని చిట్టిబాబు కోరారు.

జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు భీమాల సూరిబాబు, దొమ్మేటి దుర్గారావు, పందే సత్తిబాబు, యాండ్ర లక్ష్మణరావు, చిట్టాల వెంకన్న, చొల్లంగి చిట్టిబాబు, పమ్మి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన ఆర్డీఓ

పి.గన్నవరం: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి అన్నారు. మండలంలోని ఊడిమూడి, పి.గన్నవరం గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి, అధికారులకు పలు సూచనలిచ్చారు. రైతులకు అవసరమైన గోనె సంచులను అందించి, రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, మండల వ్యవసాయ అధికారి కె.కళ్యాణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు సాధనాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రావులమ్మ జాతర

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన రాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. అమ్మవారి పూజఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అన్నదాతల ఆరాధ్యదైవం కాటన్



రావులపాలెం మండల పరిషత్ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి



అంబాజీపేటలో కాటన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

ఆత్రేయపురం: సర్ ఆర్థర్ కాటన్ డెల్టా రూపకల్పన ద్వారా అన్నదాతల ఆరాధ్య దైవంగా నిలిచారని మాజీ ఎంపీపీ పీఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న కాటన్ విగ్రహానికి స్థానికులు గాదిరాజు ప్రసాద్‌రాజు, వేగేశ్న గోపిరాజు, ముదునూరి సోమరాజు, ముదునూరి సూర్యనారాయణరాజు తదితరుల ఆధ్వర్యంలో కాటన్ జయంతి సందర్భంగా కాటన్ పూలమాల వేసి వారు నివాళులర్పించారు.

అంబాజీపేట: అపర భగీరథుడు, అన్నదాత సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్‌లు అన్నారు. అలాగే టీడీపీ నాయకులు, బీకేఎస్ నాయకులు కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

సఖినేటిపల్లి: గోదావరి జిల్లాలను సమస్యశ్యామలం చేసిన మహనీయుడు, అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని స్థానిక సర్పంచ్ గొల్లమండల చిట్టిబాబు అన్నారు. సోమవారం సఖినేటిపల్లి లాకుల వద్ద కాటన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సర్పంచ్ పూలమాల వేసి నివాళులర్పించారు. లాకు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మోరిలో సోమవారం రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యాన సర్ ఆర్థర్ కాటన్ జయంతి ఘనంగా నిర్వహించారు. సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఓగూరి టాండన్‌రాజు, అధ్యక్షుడు గెడ్డం ప్రభాకర్‌రావు, సమాఖ్య కార్యవర్గ సభ్యులు కాటన్ చిత్రపటం వద్ద పూలమాలలు వేశారు. గోదావరిపై ఆనకట్ట నిర్మించి ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన మహనీయుడు కాటన్ అని టాండన్‌రాజు అన్నారు. సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తపేట: గోదావరి జిల్లాలకు అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని మండల వ్యవసాయ సలహా మండలి (ఎంఏఏబీ) చైర్మన్ పెదపూడి శ్రీనివాస్ అన్నారు. సోమవారం కాటన్ జయంతి పురస్కరించుకుని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహానికి ఏఏబీ చైర్మన్ శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దూళి సూరిబాబు, వాడపాలెం రైతు సంఘం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, మండల వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సత్తిరాజు ఆదిత్యకిరణ్, ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, సిద్దంశెట్టి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: కాటన్ జయంతిని మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా జరిగాయి. మండలంలో గుమ్మిలేరులో సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో కాటన్ జయంతి వేడుకలు జరిగాయి. చొప్పెల్ల ఇరిగేషన్ లాకుల వద్ద ఉత్తమ ఆదర్శ రైతు అవార్డు గ్రహీత ఆనెం వెంకన్న, ఆలమూరు సర్పంచ్ నేలపూడి లావణ్య, మోర్త వెంకట నరేష్, రాయుడు లక్ష్మణరావు తదితరులు కాటన్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. జొన్నాడ, చింతలూరు, పెనికేరు, మడికి గ్రామాల్లోనున్న కాటన్ విగ్రహాలకు ఆయా గ్రామాల్లోని రైతులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

రావులపాలెం: గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్టను నిర్మించి క్షామపీడితమైన గోదావరి డెల్టాను సస్యశ్యామలం చేయడానికి అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం కాటన్ జయంతి సందర్భంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, ఆర్‌డీఓ ముక్కంటి, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతిని సోమవారం ఘనంగా జరిపారు. కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండుమోగుల వెంకటేశ్వరరావు, గుండుమోగుల తాతాజీ, తోట దొరబాబు, రావూరి వెంకటరత్నం, ప్రభాకరరావు, వింటి సాయిరాం తదితరులు ఉన్నారు.

రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా 'దియ్యన'



రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నియమితులైన పెదకాపును సత్కరిస్తున్న విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా మండలంలోని చొప్పెల్లకు చెందిన దియ్యన పెదకాపు నియమితులయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్న పెదకాపు సేవలను గుర్తించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రాష్ట్ర నాయకత్వానికి సిఫారసు చేశారు. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లో కార్యదర్శిగా ఎంపికైన పెదకాపును ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అభినందనలు తెలిపి పూలమాలతో ఘనంగా సత్కరించారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, ఎంఎస్ఎస్ఏ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, మైనారిటీ సెల్ నాయకులు షేక్ షరీఫ్, ఉండ్రాసపు సుందరం విజయం పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ మౌలిక వసతులు



కల్వర్టు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ, గ్రామానికి మౌలిక వసతులు అందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు పొందుతున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు సోమవారం మండలంలోని విలస శివారు బీరవారిపేటలో రూ.21 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామాల్లోని రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ మొదలగు మౌలిక వసతుల కల్పనకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుసుమ లిల్లీ మంగేష్కర్, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షురాలు వార జయసావిత్రి, పార్టీ నాయకులు మట్టపర్తి వెంకటరమణ, కుసుమ వెంకటరమణ, గుత్తుల నాగబాబు, కమిడి వెంకటేశ్వరరావు, వార లక్ష్మీనరసింహరామ్, పులగుర్తి శ్రీను, మట్టపర్తి రామారావు, మిండగుదిటి రాంబాబు తదితరులు ఉన్నారు.

గల్ఫ్ శెట్టిబలిజ సేవా సంస్థకు గ్లోబల్ అవార్డు



అవార్డు అందుకున్న భాస్కరరావుతో అహ్మద్ ఆర్ట్స్ కమిటీ సభ్యులు

మలికిపురం: కువైట్ కేంద్రంగా సేవా కార్యక్రమాల నిర్వహిస్తున్న రాజోలు నియోజకవర్గానికి చెందిన గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థకు గ్లోబల్ ఫేమ్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని త్యాగరాజ గాన సభ హాలులో సోమవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కట్టా భాస్కరరావు ఈ మేరకు అవార్డు అందుకున్నారు. దక్షిణ భారత దేశంలో సేవా సంస్థల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న అహ్మద్ ఆర్ట్స్ సంస్థ గ్లోబల్ ఫేమ్ 2023 అవార్డులు ఈ ఏడాది గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థకు అందించింది. సభలో పాల్గొన్న తెలంగాణ శెట్టిబలిజ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల మీరాకుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న అనేక మంది పేదలను, క్షతగాత్రులను ఆర్థికంగా ఆదుకున్న సంస్థ సేవలు అభినందనీయమన్నారు. అవార్డు గ్రహీత కట్టా భాస్కరరావు మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా ఆర్థికసాయం కొరకు దాతలు కూడా ఎంతో మంది ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించి ప్రోత్సహించారని అన్నారు. అవార్డు స్ఫూర్తితో మరింతగా సేవా రంగంలో ముందుకు సాగుతామన్నారు. స్థానిక పెద్దలు, అవార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపాన్ని నివారించాలి

ఆలమూరు: గర్భిణులు, బాలింతల్లో తరచూ సంభవించే పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు కృషి చేయాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్, సూపర్‌వైజర్ పీపీ రమణారావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పౌష్టికాహార లోప నివారణ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. అలాగే సంధిపూడిలోని గ్రామ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో వైద్యాధికారి ఆర్.సుదర్శన్‌బాబు సుమారు 120 మంది వైద్య సేవలను అందించారు. ఆరోగ్య సిబ్బంది కె.అనంతలక్ష్మి, కె.విజయలక్ష్మి, ఆర్.రోజా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు

పి.గన్నవరం: మానేపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు లైబ్రేరియన్ బి.నాగేంద్రకుమార్ కథల పోటీలు నిర్వహించారు. విజేతలకు వచ్చేనెల 11న జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు.


నదీ జలాలు చాలా శక్తిమంతమైనవి

పి.గన్నవరం: నదీ జలాలు చాలా శక్తిమంతమైనవని, వాటిలో స్నానమాచరించడం ఎంతో ఆరోగ్యకరమని శ్రీశైలం మౌనానంద స్వామి ఆశ్రమ పీఠాధిపతి శ్రీశివస్వామి అన్నారు. సోమవారం ఆయన దేవీ ఉపాసకులు చంద్ర కిరణ్ స్వామి, ప్రేమ్ స్వామీజీలతో కలసి పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వశిష్ట నదీపాయలో స్నానమాచరించారు. నదిలో వివిధ ఆసనాలు వేసి, జలస్తంభన విద్య ప్రదర్శించి అక్కడి వారందరినీ ఆకట్టుకున్నారు. బత్తుల రాము, శేరు శ్రీనుబాబు తదితరులు స్వామీజీల వెంట ఉన్నారు.

మెరక పనులు ప్రారంభం

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో సోమవారం వైఎస్సార్ జగనన్న కాలనీ పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాండ్ర నాగమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం కాలనీకి కేటాయించిన 2.30 ఎకరాల్లో ఈ మెరక పనులు ప్రారంభించారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సహకారంతో ఈనెలాఖరు నాటికి పనులు పూర్తి చేసి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. తమలంపూడి లక్ష్మీనారాయణరెడ్డి, కట్టా సత్యప్రసాద్, ద్వారంపూడి ఇంద్రారెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి 'నల్లా' ట్రస్టు సాయం



సాయం అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ పవన్‌కుమార్

మామిడికుదురు: ప్రమాదంలో కాలు విరిగి జీవనోపాధి కోల్పోయిన అప్పనపల్లి అరుంధతీపేటకు చెందిన ఆకుమర్తి బుల్లిరెడ్డి కుటుంబానికి అమలాపురం నల్లా చారిటబుల్ ట్రస్టు ద్వారా సోమవారం ఆర్థికసాయం అందించారు. ట్రస్టు చైర్మన్ నల్లా పవన్‌కుమార్ బుల్లిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి వారికి 25 కిలోల బియ్యం, కిరాణా సరుకులు, రూ.రెండు వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో గనిశెట్టి అరవిందు, వేగి వెంకటేశ్వరరావు, కంకిపాటి వెంకటేశ్వరరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, కంకిపాటి నరసింహారావు, తులా బ్రహ్మాజీ పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

అంబాజీపేట: ప్రతి నాయకుడు, కార్యకర్త టీడీపీ విజయానికి ఇప్పటి నుంచే పనిచేసేందుకు కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ గంటి హరీష్‌మాథుర్, కో కన్వీనర్ నామన రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, నియోజకవర్గ అబ్జర్వర్ యర్రా వేణుగోపాలరాయుడు అన్నారు. నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర వంద రోజులు పూర్తయిన సందర్భంగా సంఘీభావంగా పార్టీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు దంతులూరి శ్రీనురాజు, గూడాల ఫణిల ఆధ్వర్యంలో పుల్లేటికుర్రు నుంచి అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్ వరకు పాదయాత్ర సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపేటలో 'బండారు' పాదయాత్ర

కొత్తపేట: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం ఏడు కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. మండలంలోని వాడపాలెంలో తన స్వగృహం నుంచి బండారు పార్టీ శ్రేణులతో కలిసి కొత్తపేట వరకూ పాదయాత్ర చేశారు. ఆయన వెంట టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్, రాష్ట్ర పార్టీ నాయకుడు ఆకుల రామకృష్ణ, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు వాసిరెడ్డి రాంబాబు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు గుబ్బల మూర్తి పాల్గొన్నారు.